అభివృద్ధి పథంలో 39వ డివిజన్

- రూ.14.99 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన
- డీబీటీ ద్వారా రూ.25 కోట్లు
- నాన్ డీబీటీ ద్వారా రూ.7.25 కోట్ల లబ్ధి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని 39వ డివిజన్‌లోని విద్యాధరపురం సింహభాగం వ్యాపారులు, ధనికులు నివసించే ప్రాంతం. దశబ్దాల క్రితం అప్పటి అవసరాలకు తగ్గట్టుగా రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించారు. అవి కాస్త కాల క్రమేణ ధ్వంసమై పోయాయి. పక్కనే కొండ ప్రాంతం ఉండడం, ఆ పై నుంచి వచ్చే మురుగు, వర్షపు డివిజన్‌లోని పలు ప్రాంతాల్లోని రోడ్లపైకి చేరుతుంది. వర్షాకాలం ఈ డివిజన్‌లో సమస్య జఠిలంగా ఉంటుంది. డ్రెయిన్లు పొంగి నిత్యం ఇక్కడ ప్రజలు ఇబ్బందులు పడేవారు. గత ప్రభుత్వం ఈ డివిజన్‌లో కనీస మౌలిక వసతులు కల్పించలేదు. దెబ్బతిన్న సీసీ, బీటీ రోడ్లు నిర్మించాలన్న ఆలోచన కూడా చేయలేదు. దీంతో ధ్వంసమైన రోడ్లతోనే స్థానికులు కాలం వెళ్లదీశారు.

నాన్ డీబీటీ ద్వారా

పథకం	లబ్ధిదారుల సంఖ్య	మొత్తం రూ.లలో
ఇంటి స్థలాలు	77	1,89,42,000
జగనన్న విద్యా కానుక	131	9,30,362
బైజూస్ ట్యాబ్స్	26	3,43,772
జగనన్న తోడు	73	13,59,187
జగనన్న గోరు ముద్ద	135	13,37,445
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	152	28,46,960
వైఎస్సార్ కంటివెలుగు	-	-
ఇంటింటికీ రేషన్	2,143	10,68,11,692
మొత్తం		7,25,71,418

డివిజన్ స్వరూపమే మారిపోయింది

2019వ సంవత్సరంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. గత మున్సిపల్ ఎన్నికల్లో ఇక్కడ వైఎస్సార్ సీపీ అభ్యర్థి కార్పొరేటర్‌గా గెలిచారు. డివిజన్‌లో మూడు వార్డు సచివాలయాలు వచ్చాయి. ఇక నాటి నుంచి డివిజన్‌లో అభివృద్ధి పరుగులు పెడుతోంది. ప్రధాన రోడ్లు, డ్రెయిన్లు కొత్త రూపు సంతరించుకున్నాయి. పాత పైపులైన్లు తొలగించి కొత్తవి ఏర్పాటు చేశారు. మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. వర్షపు నీరు వెళ్లేలా అవసరమైన చోట్ల కల్వర్టులు నిర్మించారు. సరిగ్గా నాలుగేళ్లలో డివిజన్ స్వరూపమే మారిపోయింది. ఈ ప్రాంతంలో ఆస్తుల విలువ రెట్టింపయ్యింది. అతి పెద్ద అండమాని బ్రహ్మయ్య వీధి, పార్థసారథి వీధి, క్వారీ వీధులు సీసీ రోడ్లు నిర్మించారు.


డివిజన్‌లో నిర్మించిన సచివాలయం




టమటం వారి వీధిలో సీసీ రోడ్డు

డివిజన్‌లో సీసీ రోడ్లు..

సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థకు అక్షరాల రూ.14. 99 కోట్లు ప్రభుత్వం ఖర్చుచేసింది. డివిజన్ పరిధిలో బుద్దావారి వీధి, పటిక బెల్లం వారి వీధి, అండమాన్ బ్రహ్మయ్య వీధి, తాయరమ్మవీధి, పార్థసారథి వీధి, శివాలయం జంక్షన్ నుంచి పార్థసారథి వీధి, అప్పల స్వామి వీధి, కేసీ పబ్లిక్ స్కూల్ రోడ్డు, కొత్త మాసు రాములు వీధి, టమటం వారి వీధి, జొన్నవిత్తుల వారి వీధి, హేమాద్రి చలపతిరావు వీధులు సీసీ రోడ్లు నిర్మాణం చేయడం జరిగింది. షాదీఖానా రోడ్డు హాట్ మిక్స్‌తో బీటీ రోడ్డు నిర్మాణం ఏడాదిన్నర కరోనాలో ఇబ్బందులు పడితే కేవలం మూడేళ్ల వ్యవధిలోనే రోడ్లన్నీ అభివృద్ధి చేశారు. ఇప్పుడా వీధులు అద్దాల్లా మెరిసి పోతున్నాయి.

డ్రెయిన్ల నిర్మాణం

పార్థసారథి వీధి, పటిక బెల్లం వారి సీసీ డ్రెయిన్లు నిర్మాణం, డీఎస్ఎంసీ స్కూల్ వద్ద కల్వర్టు నిర్మాణం, భరతవరపు వారి వీధిలో డ్రెయిన్ నిర్మాణం, అసంపూర్తిగా ఉన్న వర్షపు నీటి కాలువలను పూర్తి చేశారు. ఇవి కాక ముస్లిం శ్మశాన వాటిక కాంపౌండ్ వాల్ నిర్మాణం, క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్ వాచ్ మెన్ రూం నిర్మాణం చేపట్టారు.

పాఠశాలలకు మహర్దశ

డివిజన్‌లోని పాఠశాలలకు మహర్దశ పట్టింది. మాలంపాటి భాస్కరరావు ప్రైమరీ స్కూల్ అభివృద్ధికి రూ.19.93 లక్షలు, మైలపల్లి పోలీస్ స్కూల్ రూ.58. 93 లక్షలు, దలవాయి సుబ్బరామయ్య ఉన్నత పాఠశాలకు రూ.3.14 కోట్లు నాడు – నేడు కింద నిధులు మంజూరయ్యాయి.

ప్రత్యక్ష నగదు బదిలీ పథకం

పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	మొత్తం రూ.లలో
జగనన్న అమ్మ ఒడి	861	3,53,15,362
జగనన్న విద్యా దీవెన	628	2,80,05,027
జగనన్న వసతి దీవెన	481	82,53,610
జగనన్న విదేశీ విద్యా దీవెన	-	-
వైఎస్సార్ రైతు భరోసా	324	1,54,70,650
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	49	13,09,229
సున్నావడ్డీ పంట రుణాలు	53	1,55,445
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	62	5,87,130
మత్స్యకార భరోసా	3	60,000
వైఎస్సార్ పెన్షన్ కానుక	1028	8,67,48,500
వైఎస్సార్ చేయూత	257	1,10,43,750
వైఎస్సార్ ఆసరా	947	1,71,42,841
వైఎస్సార్ సున్నావడ్డీ	1044	34,87,541
వైఎస్సార్ కాపు నేస్తం	89	36,15,000
ఈబీసీ నేస్తం	230	58,50,000
వైఎస్సార్ కళ్యాణమస్తు	1	1,20,000
వైఎస్సార్ ఆరోగ్య శ్రీ	289	1,51,19,137
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	150	13,47,475
హౌసింగ్	46	25,93,447
వైఎస్సార్ బీమా	13	16,60,000
వైఎస్సార్ వాహనమిత్ర	89	25,00,000
వైఎస్సార్ నేతన్న నేస్తం	-	-
జగనన్న చేదోడు	95	20,80,000
కోవిడ్ సాయం	1791	17,91,000
జగనన్న తోడు (వడ్డీ)	23	5,701
మొత్తం		25,00,12,845



ప్రధాన సమస్య పరిష్కారం..

డివిజన్‌లో ప్రధాన సమస్య మురుగు. ఈ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత విద్యాధరపురంలోని ప్రతి వీధి కొత్త రూపు సంతరించుకుంది. డ్రెయినేజీ వ్యవస్థ మెరుగు పడింది. సీసీ రోడ్లు, బీటీ రోడ్లు చక్కగా తీర్చిదిద్దారు. వర్క్ షాపు రోడ్డు రూపు మారింది. డస్ట్ ఫ్రీ రోడ్లు వేశారు. నాలుగేళ్లలో డివిజన్ అభివృద్ధిలో దూసుకుపోతోంది.

– పాబోలు శ్రీనివాసరావు, వ్యాపారి



ఎన్నికల వాగ్దానాలు నెరవేర్చాం..

ఎన్నికల సమయంలో డివిజన్‌ను సమగ్రంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చాం. ఇచ్చిన మాట మేరకు ప్రతి ఒక్క హామీని నెరవేర్చాం. రూ.14.99 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పించాం. క్రైస్తవ, ముస్లిం శ్మశాన వాటికలు, షాదీఖానా ప్రహరీ నిర్మాణం చేశాం. కుమ్మరిపాలెం సెంటర్‌లో కల్వర్టు నిర్మాణం పూర్తి చేశాం.

– గుడివాడ నరేంద్ర రాఘవ, 39వ డివిజన్ కార్పొరేటర్

క్లుప్తంగా

బీసీసీఐ విజ్జీ ట్రోఫీకి చంటి, సుశాంత్ నాయుడు ఎంపిక



విజయవాడస్పోర్ట్స్: ప్రతిష్టాత్మకమైన బీసీసీఐ విజ్జీ క్రికెట్ ట్రోఫీకి విజయవాడ క్రీడాకారులు ఎం.సుశాంత్‌నాయుడు, జి.చంటి ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయాల పోటీల్లో ఇరువురు క్రీడాకారులు సత్తా చాటారు. ఈ నేపథ్యంలో దక్షణ భారత అంతర విశ్వవిద్యాలయాల నుంచి ఎంపిక చేసిన బీసీసీఐ విజ్జీ జట్టులో వీరు చోటు దక్కించుకున్నారు. వీరిద్దరు ప్రస్తుతం విజయవాడలోని నలంద డిగ్రీ కళాశాలలో చదువుతున్నారు. విజ్జీ ట్రోఫీకి ఎంపికైన సందర్భాన్ని పురస్కరించుకుని కళాశాలలో క్రీడాకారులను మంగళవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీసీసీఐ మాజీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు పాల్గొని క్రీడాకారుల ప్రతిభను కొనియాడారు. తమ కళాశాలలో క్రీడలకు ప్రోత్సాహం అందిస్తామని, క్రీడాకారులకు ఫీజులో రాయితీ ఇస్తామని ప్రిన్సిపాల్ ఎం.అనురాధ, నలంద విద్యా సంస్థల చైర్మన్ ఎ.విజయబాబు తెలిపారు. ఈ నెల 10 నుంచి అస్సాంలోని గౌహతిలో జరిగే బీసీసీఐ విజ్జీ ట్రోఫీలో క్రీడాకారులు పాల్గొంటారని కాలేజీ పీడీ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు.

దాడి ఘటనపై పరస్పరం ఫిర్యాదులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఒకరిపై మరొకరు దాడి చేసుకున్న ఘటనపై పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేసుకోగా, మంగళవారం కొత్తపేట పోలీసులు కేసులు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిట్టినగర్ ప్రైజర్‌పేటకు చెందిన జిర్రా వెంకటరమణ కుటుంబానికి పెద్దనాన్న కుమారుడైన అడవయ్య, ఇతర కుటుంబ సభ్యులతో వివాదం ఉంది. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి అడవయ్య వెంకట రమణ ఇంటి ముందు నుంచి వెళ్తూ దారిలో ఉన్న సామగ్రిని రోడ్డుపై పడేశాడు. దీంతో అడవయ్యను వెంకట రమణ కుటుంబ సభ్యులు ప్రశ్నించగా, పక్కనే ఉన్న చెక్క ముక్కతో దాడి చేశాడు. దాడిపై బాధితుడు వెంకట రమణ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఇదే వ్యవహారంలో జిర్రా దేవమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దేవమ్మ కుమారుడు అడవయ్య ఇంటికి వస్తున్న తరుణంలో దారిలో అడ్డగా ఉన్న సామగ్రిని తీయాలని అడిగాడు. దీంతో అడవయ్యతో వెంకట రమణతో గొడవ పడి దాడికి పాల్పడ్డారు. దీంతో వెంకట రమణ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

జగనన్న సురక్షతో మెరుగైన వైద్యం



ఉంగుటూరు: పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు దోహదపడతాయని ఎంపీపీ వల్లమూడి సరోజిని అన్నారు. పొట్టిపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ జగనన్న సురక్ష శిబిరాల్లో ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేస్తున్నామన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.5 లక్షలు ఉన్న ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచిందని పేర్కొన్నారు. అనంతరం వైద్య శిబిరంలో మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కత్తుల జ్యోతి, ఎన్ఏపేట సర్పంచ్ నాగరాజు, ఈఓఆర్‌డీ బాషా, కార్యదర్శి అప్పారావు, డాక్టర్ మనోహర్‌రెడ్డి, డాక్టర్ సుష్మా, డాక్టర్ కార్తిక్, డాక్టర్ ఎన్.మల్లిఖార్జునరావు, సచివాలయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో 98.82 శాతం పెన్షన్ పంపిణీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో వైఎస్సార్ పెన్షన్‌కానుక 98.82 శాతం పంపిణీ జరిగింది. జిల్లాలో మొత్తం 2,38,157 మంది పెన్షనర్లకు గాను 2,35,342 మంది పెన్షన్ అందుకున్నారు. జిల్లాలో అత్యధికంగా జి.కొండూరు మండలంలో 99.56 శాతం, జగ్గయ్యపేట అర్బన్‌లో 99.5 శాతం, జగ్గయ్యపేట మండలంలో 99.47 శాతం, వీరులపాడులో 99.37శాతం, తిరువూరు(అర్బన్)లో 99.37 శాతం పంపిణీ చేశారు.

చోడవరంలో వ్యక్తి మృతి

పెనమలూరు: చోడవరం గ్రామంలో మద్యంలో పొరపాటున కలుపు నివారణ మందు కలిపి తాగి వ్యక్తి మృతి చెందిన ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం చోడవరం గ్రామంలో మాలావతు బాలయ్య(50) వ్యవసాయ కూలీగా పని చేస్తాడు. రాత్రి సమయంలో గ్రామంలోని రైస్ మిల్లు వద్ద సెక్యూరిటీ గార్డుగా ఉంటాడు. కాగా సోమవారం ఉదయం మద్యంలో పొరపాటున నీరు అనుకుని కలుపు మందు కలుపుకొని తాగాడు. విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు మురళి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యం విక్రయిస్తున్న సస్పెక్ట్ షీటర్ అరెస్ట్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తెల్లవారుజామున మద్యం అక్రమంగా విక్రయిస్తున్న సస్పెక్ట్ షీటర్‌ను కొత్తపేట పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లంబాడీపేట సెక్టార్ ఎస్ఐ రాజనరేంద్ర మంగళవారం ఉదయం సాయిరాం థియేటర్ వద్ద గస్తీ నిర్వహిస్తుండగా, ఓ యువకుడు అనుమానాస్పదంగా కనిపించాడు. సదరు ఆ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. అతడిని నాగమ్మ సత్రం ప్రాంతానికి చెందిన షేక్ హజ్రత్ వలీ(26)గా గుర్తించారు. నిందితుడు గతంలో పలు చోరీ కేసుల్లో నిందితుడు కాగా క్రైమ్ సస్పెక్ట్ షీట్ కూడా ఉంది. ఈ నేపథ్యంలో యువకుడి వద్ద లభించిన సంచిని పరిశీలించగా అందులో బీర్ బాటిల్స్ 25, క్వార్టర్ బాటిల్స్ 6ను పోలీసులు గుర్తించారు. నిందితుడిపై కేసు నమెదు చేసి అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

8న శ్రీరామలింగేశ్వరస్వామి వార్షిక కల్యాణం

నున్న(విజయవాడరూరల్): మహాశివరాత్రిని పురస్కరించుకుని ఈ నెల 8న నున్న గ్రామంలోని గంగాపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామి వార్షిక కల్యాణ మహోత్సవం రాత్రి 7 గంటలకు స్వామివారి దేవస్థానంలో నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.అరుణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీకాశీఅన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో శివరాత్రి వేకువజామున 4 గంటల నుంచి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, విశేష అర్చనలు నీరాజన మంత్రపుష్పం జరుగుతుందన్నారు. రాత్రికి లింగోద్భవ కాలంలో మహారుద్రాభిషేకం నిర్వహిస్తామని ఆమె చెప్పారు.

నేడు ఎన్ఆర్ఈజీఎస్ కౌన్సిల్ సభ్యులు రాక

విజయవాడరూరల్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా జరుగుతున్న పనులను పరిశీలించేందుకు బుధవారం నేషనల్ రూరల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ స్కీమ్ కౌన్సిల్ సభ్యులు నున్న గ్రామానికి వస్తున్నారని ఇంజినీరింగ్ కన్సల్‌టెంట్ కె.శ్రీనివాస్ తెలిపారు. నున్న గ్రామంలో జాతీయ ఉపాధిహామీ పథకంలో రైతుల పొలాల్లో భూగర్భ జలాల కోసం నీటికుంటల తవ్వకం, జగనన్న కాలనీలో జరుగుతున్న పనులు, ప్రభుత్వ పరంగా నిర్మించిన భవనాలను కౌన్సిల్ సభ్యులు పరిశీలిస్తారన్నారు.

ప్రజల పక్షాన నిలబడేది జగనన్న ప్రభుత్వమే

వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల పక్షాన నిలబడేది కేవలం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ అన్నారు. స్థానిక 47వ డివిజన్ కార్పొరేటర్ గోదావరి గంగ – బాబుల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఏపీ ఐడీసీ చైర్‌పర్సన్ బండి నాగేంద్ర పుణ్యశీలతో కలిసి ఆసిఫ్ 47వ డివిజన్‌లో విస్తృతంగా పర్యటించారు. గడప గడపకు వెళ్లి స్థానిక సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. ప్రజలు ఆసిఫ్‌కు హారతులిచ్చి స్వాగతం పలుకుతూ ఆశీర్వదించారు. మాకు మళ్లీ జగనన్న ప్రభుత్వమే కావాలని ఆకాంక్షించారు. ప్రజల కష్టసుఖాలు తెలిసిన నాయకుడంటే సీఎం జగనన్నేనని, ఆయనే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, అప్పుడే పేదల బతుకులు బాగుపడతాయని ముక్త కంఠంతో నినదించారు.

కూటమికి పరాభవం తప్పదు

అద్దె ఇంట్లో నివసిస్తూ రెక్కల కష్టంతో కుటుంబాన్ని పోషించుకుంటూ జీవనం సాగించే పేదలకు జగనన్న ప్రభుత్వం ఇచ్చిన సెంటు భూమి విలువ తెలుస్తుందని ఆసిఫ్ పేర్కొన్నారు. ప్రభుత్వం పేదలకు ఇచ్చిన సెంటు స్థలం బాత్ రూమ్‌కు సరిపోదని చంద్రబాబు వ్యాఖ్యానించడంపై ఆయన మండిపడ్డారు. పేదలకు ఇచ్చిన సెంటు భూమి స్థలానికి పట్టాలివ్వడమే కాకుండా వాటికి పైసా ఖర్చు లేకుండా రిజిస్ట్రేషన్ కూడా చేసి ఇచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా దాదాపు 600కుపైగా ప్రభుత్వ సేవలను ప్రజల ఇంటి ముంగిటకే తీసుకువచ్చిన జగనన్న ప్రభుత్వాన్ని వారు ఎప్పటికీ మరిచిపోరని చెప్పారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమికి ఘోర పరాభవం తప్పదని హెచ్చరించారు.

పన్నుల ఎగవేత సిగ్గుచేటు

నారాయణ విద్యా సంస్థల ద్వారా విద్యార్థుల దగ్గర నుంచి అత్యధిక ఫీజులు వసూలు చేస్తున్న మాజీ మంత్రి పి.నారాయణ కుటుంబం ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులను ఎగవేయటం సిగ్గుచేటని ఆసిఫ్ పేర్కొన్నారు. అంతే కాకుండా అవినీతి ద్వారా పోగేసిన నల్లధనాన్ని తరలించేందుకు ఎన్‌స్పైరా అనే డొల్ల కంపెనీని ఏర్పాటు చేసిన నీచుడు నారాయణ అన్నారు. నారాయణ విద్యా సంస్థల వాహనాలకు సంబంధించి రూ.10 కోట్ల పన్నుల ఎగవేతపై సంస్థ డైరెక్టర్ పునీత్‌పై పోలీస్ కేసు నమోదు నమోదైందని చెప్పారు. ప్రజల సొమ్మును దోచుకోవడం చంద్రబాబు అండ్ కో కు అలవాటేనని, అందులో ఇదొక ఉదాహరణ మాత్రమేనని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు యలకల చలపతిరావు, మహదేవు అప్పాజీ, శిరంశెట్టి పూర్ణచంద్రరావు, నాయకులు గోదావరి బాబు, దేరంగుల వెంకట రమణ, మజ్జి శ్రీనివాసరావు, కూరాకుల నాగ, మద్దిరాల కమలాకర్, సోమిశెట్టి వెంకటేష్, రెడపంగు క్రాంతి, ఇంద్ర, నన్నం దుర్గ, ఇలిపిల్లి విజయలక్ష్మి, యరజర్ల మురళి, కుంభా నాగేశ్వరరావు, దిద్దుకూరి శివ, ఏనుగుల సునీల్, వరకాల జోషి, బోయళ్ళ రాజేష్, లావణ్య, ప్రవీణ్, శ్యామ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


ఆసిఫ్‌ను ఆశీర్వదిస్తున్న వృద్ధురాలు, చిత్రంలో మేయర్ భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు

మోసానికి మరో పేరు చంద్రబాబు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): చంద్రబాబునాయుడు ప్రజలను మోసం చేయటంలో మరో పేరుగా చరిత్రలో నిలిచిపోయాడని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త షేక్ ఆసిఫ్ అన్నారు. గడప గడపకు మన ఆసిఫ్ కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ సీపీ 52వ డివిజన్ పార్టీ ఇన్‌చార్జి తంగెళ్ల రామచంద్రరావు ఆధ్వర్యంలో షేక్ ఆసిఫ్ మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి మల్లికార్జున పేటలోని వివిధ ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం పర్యటించారు. స్థానిక ప్రజానీకానికి ప్రభుత్వం అందించిన పథకాలను వివరిస్తూ వాటి అమలు తీరును, స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు.


రూ.13 కోట్ల డ్వాక్రా రుణమాఫీ

అనంతరం ఆసిఫ్ మాట్లాడుతూ చంద్రబాబు నేడు జనసేనతో కలిసి మరోసారి ప్రజలను వంచించేందుకు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నారన్నారు. 14 ఏళ్లుగా ప్రజలకు ఏమి చేయలేని చంద్రబాబు మళ్లీ ఏదో చేస్తానని మాయమాటలతో కూడిన వాగ్దానాలను చేస్తున్నారని దుయ్యబట్టారు. 2014 ఎన్నికల్లో ప్రజలకిచ్చిన ఏ ఒక్క వాగ్దానాన్ని నిలబెట్టుకోలేదన్నారు. దానిని ప్రశ్నిస్తే చంద్రబాబు తన ఎన్నికల మేనిఫెస్టోను తన పార్టీ వెబ్‌సైట్ నుంచి తొలగించిన మోసగాడు అని విమర్శించారు. నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ చేయని అభివృద్ధిని సంక్షేమాన్ని తమ ప్రభుత్వం చేసిందన్నారు. 52వ డివిజన్‌లోని అక్కచెల్లెమ్మలకు రూ.13 కోట్ల డ్వాక్రా రుణ మాఫీ జరిగిందన్నారు. ఇది అక్కాచెల్లెమ్మల పట్ల తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు. ఏపీ స్టేట్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండి నాగేంద్రపుణ్యశీల, కార్పొరేటర్ యలకల చలపతిరావు, పార్టీ ట్రేడ్ యూనియన్ నగర అధ్యక్షులు విశ్వనాథ రవి, నాయకులు ధనకొండ శ్రీను, సంకాబత్తుల అశోక్, శివగౌరి, షేక్ బుజ్జి, గౌరి తదితరులు పాల్గొన్నారు.


సమస్యలు తెలుసుకుంటున్న ఆసిఫ్

రైల్వే ఆడిటోరియంలో మెడికల్ క్యాంప్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ రైల్వే హాస్పిటల్ ఆధ్వర్యంలో మంగళవారం రైల్వే ఆడిటోరియంలో మహిళా ఉద్యోగులకు మెడికల్ క్యాంప్ నిర్వహించారు. రైల్వే హాస్పిటల్ ఏసీఎమ్ఎస్‌లు డాక్టర్ ఎం.జైదీప్, డాక్టర్ ఎల్.రవికాంత్‌లు మెడికల్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ జైదీప్ మాట్లాడుతూ.. మహిళా ఉద్యోగులు తరచూగా రైల్వే హాస్పిటల్‌లో ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. 70 మంది మహిళా ఉద్యోగులకు వైద్య సిబ్బంది కాలేయం, మూత్రపిండం, కొలస్ట్రాల్, బ్లడ్ కౌంట్, షుగర్ లెవల్స్‌తో పాటు ఈసీజీ, ఎకో, జనరల్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. సీనియర్ డీపీఓ కట్టా ఆనంద్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా సాధికారతను ప్రోత్సహించేందుకు అన్ని విభాగాల సమన్వయంతో పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అందులో భాగంగా మహిళా ఉద్యోగులకు 'ఉమెన్ ఇన్ వికసిత్ భారత్ – వికసిత్ రైల్ 2047' అనే అంశంపై వ్యాసరచన, పోస్టర్ మేకింగ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో రైల్వే హాస్పిటల్ డాక్టర్లు, సిబ్బంది, పలు ప్రైవేట్ హాస్పిటల్స్ వైద్య బృందం పాల్గొన్నారు.


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

మహిళల క్రీడా సాంస్కృతిక పోటీలు ప్రారంభం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం ఆధ్వర్యంలో క్రీడా సాంస్కృతిక పోటీలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. సబ్ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో పోటీలు నిర్వహించారు. ఈనెల 7వ తేదీన సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని ఆడిటోరియంలో క్రీడా పోటీల ముగింపు కార్యక్రమం నిర్వహిస్తామని ఏపీ జేఏసీ మహిళా విభాగం చైర్ పర్సన్ పారే లక్ష్మి, ప్రధాన కార్యదర్శి పొన్నూరు విజయలక్ష్మి తెలిపారు. ముగింపు వేడుకల్లో పోటీల్లో గెలుపొందిన మహిళా ఉద్యోగులకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ముగింపు వేడుకలకు ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ, సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ విజయకృష్ణన్, ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఏపీ జేఏసీ అమరావతి సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు ముఖ్య అతిథులుగా హాజరవుతారని చెప్పారు.


లెమన్ స్పూన్ ఆడుతున్న మహిళా ఉద్యోగులు

భక్తిశ్రద్ధలతో సామూహిక వ్రతం

మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీ శివ జ్ఞాన పీఠం పీఠం ఆధ్వర్యాన మంగళవారం సాయంత్రం లోక కల్యాణార్థం సామూహిక కుజ వ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ శివజ్ఞాన పీఠం పీఠాధిపతి శివాచార్య స్వామి కుజ వ్రతం విశిష్టతను భక్తులకు వివరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు వ్రతంలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కార్యక్రమంలో గొడవర్తి శ్రీనివాస్, గార్లపాటి సుదర్శన్, కొనకళ్ల సత్యప్రసాద్, ఎస్‌వీఎస్ నాగేంద్ర దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమాలను పీఠం ఆర్గనైజర్ పి.శ్యాంప్రసాద్ పర్యవేక్షించారు.


వ్రతంలో పాల్గొన్న భక్తులు

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలి



పాయకాపురం(విజయవాడరూరల్): త్వరలో జరిగే ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని అదనపు డెప్యూటీ పోలీసు కమిషనర్ (టాస్క్‌ఫోర్స్) ఆర్.శ్రీహరి బాబు కోరారు. డీజీపీ ఆదేశాల మేరకు మంగళవారం వాంబేకాలనీలో పోలీసు అధికారులు నార్త్ జోన్ అసిస్టెంట్ పోలీసు కమిషనర్ డీఎన్‌వీ ప్రసాద్, సీఐలు ఎస్ దుర్గాప్రసాద్, జె.లక్ష్మీనారాయణ, జి.గురుప్రకాష్, టాస్క్‌ఫోర్స్ సీఐలు సీహెచ్ నాగశ్రీనివాస్, ఎస్.రమేష్‌కుమార్, సీఐఎస్ఎఫ్ ఆర్ఐ యాహిమ సిబ్బందితో కలిసి పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీసీపీ ఆర్.శ్రీహరి బాబు మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల నేపథ్యంలో కేంద్ర పారా మిలటరీ బలగాలు, విజయవాడ పోలీస్ బలగాలతో కవాతు నిర్వహించామన్నారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటుహక్కును సద్వినియోగించుకోవాలని, ఎలాంటి సంఘవిద్రోహశక్తులకు భయపడకుండా ఉండాలని చెప్పారు.

● ఇంటి పట్టాల పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులకు పూర్తి హక్కులతో ఇంటి పట్టాలు అందజేస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ మాత్రమేనని నగరపాలకసంస్థ కోఆప్షన్ సభ్యురాలు గుండే సుభాషిణి అన్నారు. స్థానిక 32వ డివిజన్‌లో 200 మందికి మంగళవారం ఇంటి పట్టాలు పంపిణీ చేశారు.